నేటి కందం- నేటికి అందం

దేశము విభజింపబడుచు
పాశవికమ్ముగ ప్రజలను పరువెత్తించన్
నాశమునిడు ద్వేష-మ్మా
కాశమ్మును దాక-నేడు-గాంధీ వగచెన్

(ఆగష్టు 14 దేశ విభజన
భయానక స్మృతి దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

సెబీ చీఫ్ అక్రమ
షేర్ల విపణి దందా
తవ్వితీసె హిడెన్ బర్గ్
దాగి ఉన్న బొంద
ప్రభుత్వం దర్యాప్తుకు
భయపడడం దేనికి
విపక్షాల ఆందోళన
విస్ఫోటన ద్రోణికి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 14-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:10 పేజీలు:6 వెల: రూ.1/-


# విద్యార్థుల మృతి బాధించింది.. చలించిపోయానన్న భట్టి

### ఉప ముఖ్యమంత్రి ఎదుట విద్యార్థుల కంటతడి
### • ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేస్తాం
### •డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
### •సంఘటన తీరుపై ఆరా
### •పెద్దాపూర్ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులతో మంత్రి పొన్నంతో కలిసి భేటీ



కరీంనగర్, ఆగష్టు 13: జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇటీవల మృతి చెందిన విద్యార్థులు గణాధిత్య, అనిరుధ్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసంఘటనపై పూర్తి వివరాలు పంపించాలని గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డిని విచారించారు.

చలించిపోయిన మంత్రులు

గురుకుల పాఠశాల విద్యార్థుల మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చలించిపోయారు. గురుకుల పాఠశాలలో డ్యూటీ నర్స్ సంబంధించిన వివరాలపై ఆరా తీశారు.

**కంటతడి పెట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి పొన్నం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు కంట తడిపెట్టారు. తల్లిదండ్రుల బాధ అర్థం చేసుకున్నామని చెప్పారు. వారిని మంత్రులు ఓదార్చారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# 2036 నాటికి 152.2 కోట్లకు చేరనున్న జనాభా

### •952కు మెరుగుపడనున్న లింగ నిష్పత్తి

న్యూఢిల్లీ ఆగష్టు 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారత జనాభా 2036 నాటికి 152.2 కోట్లకు పెరుగనున్నది. అంతేకాదు మహిళల జనాభా శాతం కూడా కాస్త మెరుగుపడనున్నది. 2011లో 48.5 శాతం ఉండగా అది 48.8 శాతానికి పెరుగనున్నది. ఈ విషయాన్ని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఓసీూఖఎ) సోమవారం తెలిపింది.'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2023' నివేదిక 15 ఏళ్ల లోపు ఉన్న లింగ నిష్పత్తి తేడా చాలా వరకు తగ్గిపోనుందని పేర్కొంది. ఫెర్టిలిటీ రేట్ కూడా పడిపోయే అవకాశం ఉందని రిపోర్టు పేర్కొంది. కాగా 60 ఏళ్ల కన్నా ఎక్కువ ఉండేవారి జనాభా పెరుగనున్నట్లు రిపోర్టు తెలిపింది. 2036 నాటికి ప్రతి 1000 మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండనున్నారని ప్రాజెక్ట్ చేసింది.

# కాగ్నిజెంట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

### -సీఎం రేవంత్ చేతుల మీదుగా రేపు విస్తరణకు శ్రీకారం
### -హాజరుకానున్న కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్
### -క్యాంపస్ విస్తరణతో మరో 15 వేల మందికి ఉద్యోగాలు
### -ఇప్పటికే హైదరాబాద్‌లో ఆయిదు క్యాంపస్‌లు
### -57 వేల మందికి దక్కిన ఉద్యోగ అవకాశం



హైదరాబాద్, ఆగష్టు 13: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్ లో తమ కొత్త క్యాంపస్ ను రేపు శంకుస్థాపన చేయనుంది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని రేపు హైదరాబాద్ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కంపెనీ విస్తరణకు శ్రీకారం చుట్టున్నారు. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు..

ఇది ఇలా ఉంటే రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్ తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్? చేస్తుంది.

ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్? చేస్తుంది.

ఇది ఇలా ఉంటే 1994లో చెన్నై కేంద్రంగా ఆవిర్భవించిన కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్‌లో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్?లు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 57 వేల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది. గడిచిన రెండేండ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 వివిధ విద్యాసంస్థల నుంచి 7500 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కాగ్నిజెంట్ కంపనీ తెలంగాణ నుంచి రూ. 7725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గడిచిన అయిదేండ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఈ కంపెనీ రూ. 22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది..

# ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 475 దరఖాస్తులు

హైదరాబాద్, ఆగష్టు 13 :: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 475 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్ కు సంబంధించి 60, సాంఘిక సంక్షేమ శాఖ కు సంబంధించి 53, పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 38, పౌరసర ఫరాల శాఖ కు సంబంధించి 36, ఇతర శాఖలకు సంబంధించి 168 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# నల్ల చెరువు కబ్జాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ ఆగష్టు 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం ఉప్పల్ నల్లచెరువును పరిశీలించారు. అప్పుడు ఆయనతో పాటు ఎంఎల్ సి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, వజ్రేశ్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ నల్ల చెరువులో కబ్జాలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. చెరువులు, నాలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా పనిచేస్తోందని రంగనాథ్ అన్నారు. కబ్జాలను ఏ మాత్రం సహించబోమని హెచ్చరించారు.

# రీజినల్ రింగ్‌రోడ్డు భూసేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి.. కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్, ఆగష్టు 13: హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఊఖీఖీ) ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చి.. సెప్టెంబర్ 2వ వారంలోగా పూర్తి చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రాష్ట్రంలోనే ప్రాధాన్యం సంతరించుకుందని.. ఈ ప్రాజెక్టుకు సబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. భూసేరణ పరిహారానికి సంబంధించిన అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని.. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం అందేలా జిల్లాస్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కోర్టు కేసులపై సైతం ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. సమీక్షకు రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవిన్ మిట్టల్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.

# ఏసిబికి చిక్కిన అదనపు కలెక్టర్

### -సీనియర్ అసిస్టెంట్‌తో పాటు పట్టుబడిన వైనం
### -భాదితుడి ఫిర్యాదుతో వలపన్నిన ఏసిబి



రంగారెడ్డి జిల్లా ఆగష్టు 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఓ జిల్లా స్థాయి అధికారి మరో ఉద్యోగితో కలసి లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన సంఘటన రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్‌రెడ్డిలు అవినీతి నిరోధకశాఖ అధికారులు పన్నిన వలకు చిక్కారు. ధరణిలో నెలకొన్న సమస్యను తొలగించేందుకు భాదితుడు ముత్యంరెడ్డి అనే వ్యక్తి వద్ద నుండి రూ. 8లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈఘటనకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14గుంటల భూమిని ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లీస్ట్ నుండి తొలగించాలని కోరాడు. అందుకు గాను సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు ముత్యంరెడ్డి ఈ విషయాన్ని ఏసిబి అధికారులకు చేరవేశాడు.సోమవారం రాత్రి 11గం.ల సమయంలో ఓఆర్ ఆర్ పరిధిలో భాదితుడు ముత్యంరెడ్డి వద్ద నుండి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షల రూపాయలు లంచం తీసుకుం టుండగా ఏసిబి అధికారులు రంగప్రవేశం చేసి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ప్రోద్భలంతోనే తాను లంచం డిమాండ్ చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ మధన్ మోహన్‌రెడ్డి ఏసిబి అధికారులకు తెలిపాడు. దీంతో ఏసిబి అధికారులు సీనియర్ అసిస్టెంట్ ఫోన్ నుండి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫోన్ చేయించి అతడితో మాట్లాడించారు. పెద్ద అంబర్‌పేట్ అవుటర్ రింగ్‌రోడ్డు వద్దకు డబ్బులు తీసుకురావాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహనరెడ్డికి తెలిపాడు. ఫోన్ సంభాషణలను విన్న ఏసిబి అధికారు లు అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తూ అక్కడికి చేరుకుని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కాగా సోమవారం రాత్రి నుండి భూపాల్‌రెడ్డి నివాసం వద్ద ఏసిబి అధికారులు సోదాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎసిబి సిటీ రేంజ్ 1 డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జానకిరామ్ రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం.



# ఏపీ హైకోర్టు సంచలన నిర్ణయం.. ఆ జీవో నిలుపుదలకు ఉత్తర్వులు జారీ

అమరావతి, ఆగష్టు 13: ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య కళాశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి కోటా సీట్ల కేటాయింపుపై ఏపీ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల కేటాయింపు జీవోను నిలిపివేస్తూ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సీట్ల కేటాయింపు జీవోను సవాలు చేస్తూ మెడికల్ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది.

సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయిస్తే ఓపెన్ కేటగిరీలో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. వెంటనే ఈ జీవోను నిలుపద చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరారు. మెడికల్ సీట్లు పెంచి ఈడబ్ల్యూస్ కింద సీట్లు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ఠాకూర్ వాదించారు. పిటిషనర్ వాదనను అంగీకరించినా న్యాయస్థానం జీవోను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను ఆరు వారాలకు ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

ఈడబ్ల్యూఎస్ కోటాను కేంద్రం 2019లో ప్రవేశపెట్టింది. మొత్తం సీట్లలో పదిశాతం ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు కేటాయించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 56 మెడికల్ కాలేజీలుండగా వాటిలో ఐదారు కళాశాలల్లోనే కోటా అమలు చేస్తున్నారు. ఈ జీవో వల్ల యూజీలో 572, పీజీలో 180 సీట్లను ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు నష్టపోయే అవకాశముంది.

# తెలంగాణకు మూడురోజులు వర్ష సూచన

హైదరాబాద్, ఆగష్టు 13: తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి మోస్తరు వర్షాపాతం కురిసే నమోదయ్యే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నాటి ద్రోణి రాయలసీమ కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులు.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.

శుక్రవారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, జయశంకర్, నల్గొండ, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో వర్షం కురిసింది. అత్యధికంగా హైదరాబాద్ నగర పరిధిలోని ఖైరతాబాద్‌లో 8.3 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

# సీఎం అరవింద్ కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగష్టు 13: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు సెప్టెంబర్ 2 వరకు పొడిగించింది. జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో ఇద్దరు నేతలను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఎదుట హాజరు పరిచారు. ఈ క్రమంలో న్యాయమూర్తి కస్టడీని పొడిగించారు. మద్యం పాలసీ కేసుకు సంబంధించిన కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు గతంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, సీబీఐ కేసులో ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలు ఉన్నారు.

# దేశ విభజన మిగిల్చిన గాయలు ఇంకా మానలేదు !

## (ఆగష్టు 14న "విభజన విషాద స్మృతి దినం' సందర్భంగా)

అనాలోచితంగా, అజ్ఞానంగా, వివాదాస్పదంగా, అకారణంగా, విభజించి విచ్చిన్నం చేయాలనే దుర్బుద్ధితో అఖండ భారతాన్ని ఇండియా, పాకిస్థాన్‌గా అశాస్త్రీయ రాజకీయ విభజన చేసిన కారణంగా నాటి ప్రజలు పడ్డ బాధలు, విద్వేషాలు, హింసాగ్నిలో లక్షల ప్రజలు నిర్వాసితులు కావడం, మాన ప్రాణాలు కోల్పోవడం హిందుస్థాన్‌లో ఓ మరువలేని మహావిషాద దుర్ఘటన. మతపరంగా విభజన కోరిన ముస్లిమ్‌లు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినాన్ని 14 ఆగష్టున పాటిస్తున్నారు. శవాల కుప్పలు, ధౌర్జన్యకర విషాదాల పునాదిగా జరిగిన విభజన దేశ చరిత్రలో ఓ చీకటి రోజు. 1947 ఆగష్టు 15 అర్థరాత్రి లభించిన భారత స్వాతంత్ర్యానికి సంబరాలు చేసుకోవాలో, విభజన విష వలలో చిక్కిన అమాయక ప్రజలు కోల్పోయిన మాన ప్రాణాలను చూసి దుఃఖించాలో తెలియని దుస్థితి నాటి ప్రతి బాధ్యతగల భారతీయ పౌరుడిది.

విభజన గాయాల నడుమ స్వాతంత్ర్యం:

బ్రిటీష్ పాలకులు వ్యాపార బుద్ధితో ప్రవేశించి, దేశ సంస్కృతీ వారసత్వాలను నాశనం చేసి, దేశ సంపదను పీల్చేసి, శవాల దిబ్బలను మిగిల్చి వెళ్ళిన దుర్దినమది. ముఖంపై స్వాతంత్ర్యం దక్కిందనే సంతోషం, మదిలో విభజన చేసిన గాయాల బాధల నడుమ దేశం పరాయి పాలన నుండి విముక్తం అయ్యింది. విభజన అకాలంలో జరిగిన హింసాత్మక ఘటనలు, మారణహోమాలు భారతీయులపై చెరగని శాశ్వత మచ్చలుగా మిగిలిపోయాయి. అఖండ భారతదేశ విభజన అత్యధిక మానవ వలసలను చవి చూసింది. లక్షల కుటుంబాలు, దాదాపు 2 కోట్ల ప్రజలు తమ తమ వారసత్వంగా వచ్చిన పల్లెలు, పట్టణాలు, నగరాలు, జన్మ భూములను వదిలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొత్త జీవితాలను వెతుక్కోవలసిన దుస్థితి అది.

పోతూ పోతూ విభజన చిచ్చు పెట్టిన తెల్ల దొంగ(ర)లు:

దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతం, హింసోన్మాదానికి, అరాచక అకృత్యాలకు బలైన భరతమాత బిడ్డలను స్మరించుకోవాలనే సదభిప్రాయంతో ప్రతి ఏట 14 ఆగష్టున 'విభజన విషాద స్మృతి దినం (పార్టీషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే)' పాటించాలని నిర్ణయించడం సముచితమే కాదు హర్షదాయకం కూడా. 15 ఆగష్టు 1947 స్వాతంత్ర్య సంబరాల వేదికగా మహాత్మాగాంధీ మాట్లాడుతూ 'రెండు దశాబ్దాల తెల్ల దొంగల దాస్య శృంఖలాలను ఛేదించుకొని, బానిస బతుకులకు చరమగీతం పాడుతూ భారతీయులు స్వేచ్ఛావాయువులు పీల్చాలంటూనే, దేశ విభజనకు అంగీకరించాలి' అని కోరారు. గత 77 ఏండ్లుగా విభజన గాయాలను మర్చిపోలేనప్పటికీ, సమగ్రాభివృద్ధి దిశగా నిరంతరం ప్రగతి పయనాలు కొనసాగుతునే ఉన్నాయి.

పెనుశాపాలైన అశాస్త్రీయ విభజన రేఖలు:

భారతదేశం పట్ల కనీస జ్ఞానం లేని బ్రిటీష్ లాయర్ 'సర్ సిరిల్ రెడ్‌క్లిఫ్' అఖండ భారత పటంపై గీసిన దేశ సరిహద్దు గీతలు కోట్ల ప్రజలకు పెనుశాపాలుగా మారడంతో పాటుగా, ఆ జ్ఞాపకాలు మన గుండెల్ని నేటికి విషాద సంద్రంలో ముంచేస్తూనే ఉన్నాయి. సువిశాల భారత విభజనతో ఇండియా, పాకిస్థాన్ (ఈస్ట్ అండ్ వెస్ట్ పాకిస్థాన్) ఏర్పడ్డాయి. ముస్లిమ్‌లు అధికంగా ఉన్న పంజాబ్ ప్రాంతాన్ని వెస్ట్ పాకిస్థాన్(నేటి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్)గా, ముస్లిమ్‌లు అధికంగా ఉన్న బెంగాల్ ప్రాంతాన్ని ఈస్ట్ పాకిస్థాన్‌గా (నేటి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్) వేరు చేశారు. ఈస్ట్ పాకిస్థాన్ ప్రజల కోరిక మేరకు 1971లో ఇండో-పాక్ యుద్ధంలో బంగ్లాదేశ్‌ను విముక్తం చేయడంలో కూడా భారత దేశం 2,500-3,843 మంది సైనికుల ప్రాణాలు కోల్పోవడం, 12,000 మంది జవాన్లు గాయాల పాలుకావడం, అపార ఆర్థిక నష్టాన్ని భరించడం చూశాం. 1947లో జరిగిన దేశ విభజన ప్రపంచ చరిత్రలో అతి పెద్ద హింసాత్మక, రక్తం ఏరులై పారిన అర్థరహిత రాజకీయ మానవ వలసగా చరిత్రకారులు పేర్కొంటారు. మిలియన్ల మానవ వలసలు, లక్షల మరణాలు, వేల మానభంగాలతో అత్యంత అమానవీయంగా దేశ విభజన మరువలేని విషాదాన్ని మిగిల్చింది. పాకిస్థాన్ ప్రాంత హిందువులు, సిక్కులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భారత సరిహద్దుల్లోకి పరుగులు తీయడం, భారత్‌లోని ముస్లిమ్‌లు అధికంగా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకోవడం కూడా విస్మయంతో చూశాం, నేటికీ సమైక్యతకు కలుగుతున్న విఘాతాలను భరిస్తున్నాం.

లక్షల మరణాలు, మిలియన్ల వలసలు:

నాటి వాషింగ్టన్ పోస్ట్ పత్రిక కథనం ప్రకారం, అశాస్త్రీయ మత రాజకీయాల ఆధారంగా చేసిన దేశ విభజనలో 2 లక్షల నుంచి 20 లక్షల వరకు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి ఉంటారని, 10 నుంచి 20 మిలియన్ల మానవ వలసలు జరిగాయని అంచనా వేసింది. విభజనతో ప్రాణాలు, జీవనోపాధులు కోల్పోయిన భారతీయుల వలసల వల్ల దేశ విద్య, ఆర్థిక స్థితులపై అధిక ప్రతికూల ప్రభావం పడింది. హిందువుల ఇండ్లను కాల్చి వేయడం, సంపదను దోచుకోవడం, మహిళల్ని రేప్ చేయడం, పిల్లల్ని కసాయి కత్తులను బలి చేయడం, రక్తంతో నిండిన రైళ్లు సవాల కుప్పల్ని రవాణ చేయడం, ప్రయాణీకులను నిర్దాక్షిణ్యంగా మత వివక్షతో చంపేయడం లాంటి అమానవీయ ఘటనలు చవి చూసింది భారత విషాద విభజన.

ఐరాస అంచనా ప్రకారం విభజన విషాదంలో 14-20 మిలియన్ల అమాయక హిందువులు, సిక్కులు, ముస్లిమ్‌లు కాలినడకన బిడ్డల్ని సంకన ఎత్తుకొని, మూటముల్లె సర్ది నెత్తిన పెట్టుకొని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సరిహద్దులు దాటడం అత్యంత అమానవీయ ఘోరంగా చరిత్ర పుటల్లో నిలిచింది. భరతమాత బిడ్డలుగా, దేశభక్తి ఉప్పొంగే పౌరులుగా మనందరం ప్రతి ఏట 14 ఆగష్టు రోజున 'విభజన విషాద స్మృతి దినం' పాటించడం మన కనీస కర్తవ్యంగా భావిద్దాం, పరమతసహనాన్ని జీర్ణించుకుందాం, సామరస్యంగా జీవిద్దాం, శాంతియుతంగా పయనిద్దాం, గీత దాటితే వాత పెడదాం.

జై జవాన్ ; జై కిసాన్ ; జై హిండ్ ; జై విద్వాన్ జై అనుసంధాన్.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ముఖ్యమంత్రి రైతు సదస్సును జయప్రదం చేయండి

- వైరా సభకు భారీగా తరలిరండి
- రైతుల శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, ఆగష్టు 13: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 15వ తేదీన వైరాలో జరుగు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కొనిజర్ల మండలం నుండి భారీగా ప్రజలు తరలిరావాలని జిల్లా కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు అన్నారు. కొనిజర్ల మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ...మండలం నుండి 15,000 మంది బహిరంగ సభకు తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంక్షేమ పథకాలను మాత్రం నిరంతరాయంగా కొనసాగిస్తుందన్నారు. రైతులకు రుణ భారం కాకూదని, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే అధిక ప్రాధాన్యతే రుణమాఫీ కార్యక్రమమని అన్నారు. రైతు రుణమాఫీ అనేది రైతులకు పండగ లాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని తెలిపారు. మొదటి విడతలో ఒక లక్ష రూపాయలు రుణమాఫీ రైతు ఖాతాలో జమ అవుతుందని అన్నారు. మీ రుణం జీరో అవుతుందని అన్నారు. రైతులు రుణమాఫీ కాలేదని అధైర్యపడవద్దు అని రెండో విడత, మూడో విడతలో రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు.



వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉండి సలహాలు అందించి రుణమాఫీ పథకంలో అర్హత కలిగిన ప్రతి రైతు లబ్ది పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో నేతలు బహిరంగ సభకు నిర్దేశించిన లక్ష్యాన్ని అనుగుణంగా ప్రజలను తరలించాలని కోరారు.

# పెన్షనర్లు చందాదారులకు అవగాహన దిశగా 'ఇపిఎఫ్ఓ' 5వ సదస్సు ప్రత్యక్ష కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 13: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) ప్రత్యక్ష అవగాహన కల్పన కార్యక్రమాల్లో భాగంగా 2024 ఆగష్టు 13న 5వ సదస్సును నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమంలో 'ఇపిఎఫ్ ఖాతా బదిలీ'పై అవగాహన కల్పిస్తుంది. ఈ కార్యక్రమాన్ని 'ఇపిఎఫ్ఓ' సామాజిక మాధ్యమ ఖాతాలు- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్ ద్వారా చూడవచ్చు. ఈ సందర్భంగా 'ఇపిఎఫ్' బదిలీ ప్రాధాన్యం-ప్రక్రియ, విశిష్ట ఖాతా సంఖ్య (యుఎఎన్) లేదా సభ్యత్వ గుర్తింపు సంఖ్య (ఎం.ఐడి)ల విలీనం వంటివాటిపై నిపుణులు వివరించడం తోపాటు సందేహ నివృత్తి చేస్తారు.

'ఇపిఎఫ్ఓ' ప్రతినెల రెండో మంగళవారం సంస్థ సభ్యులు, పెన్షనర్లకు వివిధ అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పన కార్యక్రమాలు నిర్వహిస్తూంటుంది. ఇందులో భాగంగా తొలి కార్యక్రమం 2024 మే 14న 'ఇపిఎఫ్-95' పథకంపై నిర్వహించారు. అనంతరం 2024 జూలై 31 నాటి కార్యక్రమంలో 'స్తంభింపజేసిన ఖాతాల'పై అవగాహన కల్పించారు. ఈ రెండింటి విషయంలో సభ్యులు, పెన్షనర్ల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వీటిపై దృష్టి పెట్టింది.

ఈ కార్యక్రమం ద్వారా వివిధ అంశాలపై సమాచారం ఇవ్వడంతోపాటు సభ్యుల ప్రశ్నలకు నిపుణులు జవాబివ్వడం వల్ల వారికి జీవన సౌలభ్యం కలుగుతుంది. ఎప్పటికప్పుడు తాజా సమాచారంతోపాటు సందేహ నివృత్తి చేయడం, ఈ రంగంలో తాజా సంస్కరణల గురించి తెలపడం లక్ష్యంగా 'ఇపిఎఫ్ఓ' క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

# పవన్ కల్యాణ్ తో తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడి భేటి



తిరుపతి, ఆగష్టు 13: సైన్స్ డే సందర్భంగా శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న డిప్యూటీ సీఎం పంచాయతీ రాజ్, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి ఆయన చేరుకున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోట బయలుదేరి వెళ్లారు.

మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతి ఎస్పీ

ఈ సందర్భంగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసినవారిలో జేసీ శుభం బన్సల్, మునిసిపల్ కమిషనర్ తిరుపతి నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఆర్డీఓలు నిషాంత్ రెడ్డి, రవి శంకర్ రెడ్డి, ఎస్ డి సి ప్రోటోకాల్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

# చంద్రయాన్-3 అద్భుత విజయానికి ప్రతీకగా ఆగష్టు 23ను "జాతీయ అంతరిక్ష దినోత్సవం"గా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 13: చంద్రయాన్-3 మిషన్ అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏటా ఆగష్టు 23వ తేదీని "జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా నిర్వహించుకోవాలని ప్రకటించింది. నిరుడు ఇదే తేదీన చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా పాదంమోపి, ప్రజ్ఞాన రోవర్‌ని కార్యరంగంలో దింపిన అద్భుత క్షణానికి గుర్తుగా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ చరిత్రాత్మక విజయం భారతదేశాన్ని అంతరిక్ష పథంలో స్వావలంబన సాధించిన దేశాల సరసన నిలిపింది. ఆ మేరకు చంద్రునిపై అడుగుపెట్టిన నాలుగో దేశంగా, ప్రత్యేకించి చంద్ర దక్షిణ ధ్రువంపై కాలు మోపిన తొలి దేశంగా ఘనతకెక్కింది. అందుకే అంతరిక్ష విజ్ఞాన సాంకేతిక రంగంలో యువతరానికి ప్రేరణనిచ్చే లక్ష్యంతో 2024 జూలై, ఆగస్టు నెలల్లో దేశవ్యాప్తంగా ఈ విజయోత్సవం నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా కేంద్ర మత్స్య-పశుసంవర్ధక-పాడి పరిశ్రమల శాఖ, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే "జాతీయ అంతరిక్ష దినోత్సవం''లో పాల్గొంటారు. ఆ శాఖ సహాయ మంత్రులు ప్రొఫెసర్.ఎస్.పి.సింగ్ బాఘేల్, శ్రీ జార్జ్ కురియన్, మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాష్ లిఖి, ఇతర ప్రముఖులు కూడా దీనికి హాజరవుతారు.

చంద్రయాన్-3 మిషన్ అద్భుత విజయానికి గుర్తుగా డాక్టర్ అభిలాష్ లిఖి మార్గదర్శకత్వాన తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ''మత్స్య పరిశ్రమలో అంతరిక్ష సాంకేతికతల వినియోగం'' ఇతివృత్తంగా 18 ప్రదేశాలలో సెమినార్లు, ప్రదర్శనలను మత్స్య శాఖ నిర్వహిస్తోంది. ఫిషరీస్‌లో స్పేస్ టెక్నాలజీ-ఒక అవలోకనం, సముద్ర అవసరాల కోసం కమ్యూనికేషన్-నావిగేషన్ సిస్టమ్, స్పేస్ ఆధారిత పరిశీలన-మత్స్య రంగం మెరుగుదలలో దాని ప్రభావం... వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చిస్తారు.

అంతరిక్ష విభాగం, ఇన్కయాసిస్, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సహా మత్స్యకారులు, సాగర్ మిత్రలు, ఎఫ్ఎఫ్‌పిఓ లు, మత్స్య సహకార సంఘాలు, ఐసిఎఆర్ మత్స్య పరిశోధన సంస్థలు, రాష్ట్రం/యూటీల మత్స్య శాఖలు, ఫిషరీస్ విశ్వవిద్యాలయాల, కళాశాలల విద్యార్థులు సహా ఇతర వాటాదారులు హైబ్రిడ్ మోడ్‌లో పాల్గొంటారు.

అయితే మత్స్య శాఖకు ఈ వేడుకలతో సంబంధం ఏమిటనే ప్రశ్నకు ఈ కథనం సమగ్ర సమాధానమిస్తుంది:

భారత మత్స్య రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి, ఆర్థిక అవకాశాల కల్పనలో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ మేరకు 8,118 కిలోమీటర్ల పొడవైన విశాల తీరప్రాంతం, 2.02 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తృతిగల ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్), సమృద్ధిగాగల లోతట్టు నీటి వనరులతో భారతదేశం విశిష్ట ప్రగతి సాధిస్తున్న మత్స్య పర్యావరణ వ్యవస్థను కలిగి ఉంది.

అంతరిక్ష సాంకేతికత పరిజ్ఞానం భారతీయ సముద్ర మత్స్య నిర్వహణ, అభివృద్ధిని గణనీయంగా పెంచుతాయి. శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఎర్త్ అబ్జర్వేషన్స్, శాటిలైట్ ఆధారిత నావిగేషన్ సిస్టమ్, జిఐఎస్, శాటిలైట్ కమ్యూనికేషన్, డేటా అనలిటిక్స్, ఏఐ మొదలైన కొన్ని సాంకేతికతలు ఈ రంగంలో గొప్ప పరివర్తన తెచ్చాయి.

శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సముద్రపు రంగు, క్లోరోఫిల్ కంటెంట్, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతను పర్యవేక్షించడానికి ఓషన్-శాట్, ఇన్సాట్ వంటి ఉపగ్రహాలను ఉపయోగించుకుంటుంది. మత్స్య సంపద క్షేత్రాలను గుర్తించడానికి, సముద్ర స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ఫైటోప్లాంక్టన్ బ్లూమ్‌లు, అవక్షేపాలు, కాలుష్య కారకాలను కూడా ఇది గుర్తిస్తుంది. సముద్రపు ప్రవాహాలు, అలలు, విపరీత వాతావరణ ప్రమాదాలను పర్యవేక్షించడానికి, చేపలు పట్టే కార్యకలాపాలను అనుకూల పరచడానికి, భద్రతను నిర్ధారించడానికి భూపరిశీలనా శాటిలైట్లు ఇన్సాట్, ఓషన్ సాట్, ఎస్ఏఆర్ మొదలైన ఉపగ్రహాలు పరిశీలిస్తాయి.

ఇండియన్ కాన్స్టెలేషన్ తో నావిగేషన్ (నావ్ఐసి)ని శాటిలైట్ ఆధారిత నావిగేషన్ వ్యవస్థ, జిఐఎస్ ఉపయోగించుకుంటాయి. ఫిషింగ్ ఓడల కోసం జిఎన్ఎస్ఎస్ ట్రాకింగ్, సముద్ర నివాసాలు, మత్స్య క్షేత్రాలు, రక్షిత ప్రాంతాలను గుర్తిస్తారు. ఉపగ్రహాలతో సముద్రంలో కమ్యూనికేషన్ సాధ్యమవుతుంది. శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు సముద్రాలపై అవగాహన, భద్రత, మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి నౌకలు, తీర ఆధారిత స్టేషన్‌లు, పరిశోధనా సంస్థల మధ్య రియల్ టైం డేటా మార్పిడికి అవకాశం కలిగిస్తాయి.

డేటా అనలిటిక్స్, ఏఐ వివిధ వనరుల నుండి డేటాను ఉపయోగించి చేపల పంపిణీలను అంచనా వేస్తాయి. అలాగే ఇవి వ్యత్యాసాలను గుర్తించగలవు, మత్స్య నిర్వహణను గరిష్ఠం చేయగలవు. ఈ అధునాతన వ్యవస్థలు చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించడం, ఆక్వా మ్యాపింగ్‌కు మద్దతు ఇవ్వడం, విపత్తు హెచ్చరికలను అందించే ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సముద్రంలో సామర్థ్యాన్ని, భద్రతను మెరుగుపరుస్తాయి. అంతేకాకుండా ఇమేజ్ సెన్సింగ్, ఆక్వా జోనింగ్ వంటి సాంకేతికతలు సమర్థవంతమైన మత్స్య నిర్వహణ కోసం ఖచ్చితమైన సాధనాలను అందిస్తాయి.

పొటెన్షియల్ ఫిషింగ్ జోన్స్ (పిఎఫ్ జెడ్) సలహా-సూచనలు సముద్ర మత్స్య రంగంలో విశేషమైన మార్పులను తీసుకొచ్చాయి. ఓషన్-శాట్ ఉపగ్రహం నుండి ఓషన్ కలర్ మానిటర్ డేటాను పొందడం ద్వారా, చేపల సముదాయానికి సంబంధించిన సంభావ్య సముదాయాలను గుర్తించి, మత్స్యకారులకు తెలియజేస్తారు. ఈ పిఎఫ్ జెడ్ సలహాసూచనలు 2014లో 3.49 లక్షల టన్నుల నుండి 2023లో 5.31 లక్షల టన్నులకు భారతదేశ సముద్ర మత్స్య సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాయి. ఇది మత్స్యకారులు మెరుగైన సాగు ప్రదేశాలను గుర్తించి, సమర్థవంతంగా మత్స్య సాగు చేసుకునే వీలు కల్పించింది. సముద్రంలో వెచ్చించే సమయం, శ్రమను తగ్గించి సముద్ర వనరుల స్థిరమైన నిర్వహణకు దారులు వేసింది.

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్వై) కింద పర్యవేక్షణ, నియంత్రణ, నిఘా (ఎంసిఎస్) ద్వారా కేంద్ర మత్స్య శాఖ ఈ సాంకేతిక పురోగతికి మద్దతు ఇస్తుంది. వెరీ హై ఫ్రీక్వెన్సీ (విహెచ్ఎఫ్) రేడియోలు, డిస్ట్రెస్ అలర్ట్ ట్రాన్స్‌మిటర్లు (డాట్ లు), నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టెలేషన్ (నావ్ఐసి) ఎనేబుల్డ్ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జిఎన్ఎస్ఎస్), ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్), పొటెన్షియల్ ఫిషింగ్ జోన్స్ (పిఎఫ్ జెడ్) సమాచారం వంటి సేవలతో ఫిషింగ్ నౌకల కోసం ట్రాన్స్‌పాండర్లు వంటి కమ్యూనికేషన్, ట్రాకింగ్ పరికరాలను అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకతలు.

మరోవైపు పీఎంఎస్ఎస్వై కింద పర్యవేక్షణ, నియంత్రణ, నిఘా కోసం సముద్రపు ఫిషింగ్ నౌకల్లో వెస్సెల్ కమ్యూనికేషన్, సపోర్ట్ సిస్టమ్ కోసం నేషనల్ రోల్ అవుట్ ప్లాన్‌పై ప్రాజెక్ట్‌ను కేంద్ర మత్స్య శాఖ ఆమోదించింది. నేషనల్ రోల్‌అవుట్ ప్లాన్ రూ.364 కోట్లతో 9 తీరప్రాంత రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాలలో మెకనైజ్డ్, మోటరైజ్డ్ ఓడలతో సహా మెరైన్ ఫిషింగ్ ఓడలపై 1,00,000 ట్రాన్స్‌పాండర్‌లను అమర్చాలని భావిస్తోంది.

# భారత్-మాల్దీవ్స్ మధ్య 1,000 మంది సివిల్ సర్వీస్ అధికారులకు శిక్షణపై అవగాహన ఒప్పందం పునరుద్ధరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 13: భారత్-మాల్దీవ్స్ ప్రగతి భాగస్వామ్యంపై ఆగష్టు 9వ తేదీన మాల్దీవ్స్ రాజధాని మాలె నగరంలో రెండు దేశాల విదేశాంగ శాఖ మంత్రులు డాక్టర్ ఎస్.జైశంకర్, శ్రీ మూసా జమీర్ చర్చల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 2024-2029 మధ్య ఐదేళ్లపాటు 1000 మంది మాల్దీవ్స్ సివిల్ సర్వీస్ అధికారుల సామర్థ్య వికాస శిక్షణకు ఉద్దేశించిన అవగాహన ఒప్పందం పునరుద్ధరిస్తూ వారిద్దరి సమక్షంలో సంతకాలు పూర్తయ్యాయి.

భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నేతృత్వాన జాతీయ సుపరిపాలన కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్- ఎన్‌సిజిజి) ఇప్పటిదాకా బంగ్లాదేశ్, టాంజానియా, గాంబియా, మాల్దీవ్స్, శ్రీలంక, కంబోడియా దేశాల సివిల్ సర్వీస్ అధికారులకు సామర్థ్య వికాస కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. అలాగే లాటిన్ అమెరికన్ దేశాలతోపాటు 'ఎఫ్ఐపిఐసి/ఐఒఆర్' దేశాల వారికోసం బహుళ-దేశీయ కార్యక్రమాలను కూడా నిర్వహించింది.

సామర్థ్య వికాస శిక్షణకు సంబంధించి 1000 మంది మాల్దీవ్స్ సివిల్ సర్వీస్ అధికారులకు శిక్షణ దిశగా భారత జాతీయ సుపరిపాలన కేంద్రం (ఎన్‌సిజిజి), మాల్దీవ్స్ 'సివిల్ సర్వీస్ కమిషన్' మధ్య 2019 జూన్ 8న అవగాహన ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం కింద ఐదేళ్ల కాలంలో... 2024 నాటికి 'ఎన్‌సిజిజి' కీలక మైలురాయిని అధిగమించింది. ఈ మేరకు మాల్దీవ్స్ శాశ్వత కార్యదర్శులు, సెక్రటరీ జనరళ్లు, ఉన్నత స్థాయి ప్రతినిధులు సహా వివిధ కేడర్లలోని 1000 మంది సివిల్ సర్వీస్ అధికారులకు శిక్షణ పూర్తిచేసింది. ఇందులో భాగంగా మాల్దీవ్స్ అవినీతి నిరోధక కమిషన్ (ఎసిసి), ఇన్ఫర్మేషన్ కమిషన్ (ఐసిఒఎం) అధికారులు సహా సివిల్ సర్వెంట్ల కోసం మొత్తం 32 'ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్' కార్యక్రమాలు నిర్వహించింది.

ఈ సంయుక్త భాగస్వామ్యం విజయవంతమైన నేపథ్యంలో ఒప్పందాన్ని మరో ఐదేళ్లపాటు పునరుద్ధరించాలని మాల్దీవ్స్ విదేశాంగా మంత్రిత్వశాఖ కోరింది. తదనుగుణంగా 2029 నాటికి మరో 1,000 మంది అధికారులకు శిక్షణ లక్ష్యంగా 2024 ఆగస్టు 9న అధికారికంగా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తూ సంతకాలు పూర్తయ్యాయి.

దీంతో ప్రభుత్వ విధానాలు, పాలన, క్షేత్రస్థాయి వ్యవహారాల నిర్వహణలో మాల్దీవ్స్ సివిల్ సర్వీస్ అధికారుల సామర్థ్యం ఇనుమడిస్తుంది. అంతేకాకుండా భారత్-మాల్దీవ్స్ సంబంధాలను మరింత బలోపేతం అవుతుంది.

అనేక దేశాల్లో ప్రభుత్వ విధానాలు, పరిపాలనపై విజ్ఞాన ఆదానప్రదానంతోపాటు సహకార విస్తృతిని ప్రోత్సహించడంలో జాతీయ సుపరిపాలన కేంద్రం (ఎన్‌సిజిజి) విశేష కృషి చేస్తోంది.

ఇందులో భాగంగా ప్రభుత్వాధికారులకు కెరీర్ మధ్యలో సామర్థ్య వికాస కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పౌరకేంద్రక పరిపాలన, సేవాప్రదానంలో మెరుగుదల, వినూత్న పాలన పద్ధతుల ఆవిష్కరణకు ప్రోత్సాహం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాలను రూపొందించింది.

అలాగే పౌరుల డిజిటల్ సాధికారత, వ్యవస్థలలో డిజిటల్ పరివర్తన దిశగా భారత్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను కూడా ఈ కార్యక్రమాలు ప్రతిబింబిస్తాయి.

# కన్నయ్య మృతదేహానికి ఘనంగా నివాళులర్పించిన పరికపల్లి



ఖమ్మం, ఆగష్టు 13: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామానికి చెందిన చింతల కన్నయ్య గుండెపోటుతో మృతి చెందాడు. వారి పార్థివదేహానికి నివాళులర్పించి న కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్. ఆయన మాట్లాడుతూ...అధైర్యపడవద్దని అండగా ఉంటానని హామీనిచ్చి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రామం లో ఎవరైనా మృతి చెందినప్పుడు ఫ్రీజర్ బాక్స్ కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సివస్తుందని పరికపల్లి శ్రీనివాస్ చొరవతో లక్ష రూపాయలతో ఫ్రిజర్ బాక్స్ ని అందజేసిన దాతలు మందా పుల్లయ్య-రాంబయమ్మ దంపతులకు వారు కృతజ్ఞతలు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ గ్రామంలో ఎవరికి అవసరమైన ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు కంచు బీరయ్య, చింతల మల్లయ్య, రాంబాబు, గజ్జల కృష్ణ, మురళి, సవళ్ళ నరసింహా రావు, గంగులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అణువిద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, ఆగష్టు 13: ఉక్రెయిన్‌కు చెందిన జపోరిజియా అణు విద్యుత్ కేంద్రంలో పేలుళ్ల సంభవించి భారీగా మంటలు ఎగసి పడుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్ రష్యా నియంత్రణలో ఉంది. ఈ ప్లాంట్‌లో పేలుళ్లకు రష్యా దళాలే పాల్పడ్డాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపిస్తుండగా, ఉక్రెయిన్ ప్రయోగించిన ఫిరంగి గుండ్ల వల్లనే మంటలు చెలరేగాయని రష్యా వాదిస్తోంది. ప్రస్తుతం ఆ ప్రదేశంలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ సిబ్బంది కూడా ఉన్నారు. ప్రస్తుతానికి ఆ ప్లాంట్‌నుంచి అణు లీక్ జరగలేదని చెప్పారు. ప్రమాద స్థలానికి తమను వెళ్లనీయాలని కోరారు. అణుకేంద్రానికి సంబంధించిన కూలింగ్ టవర్‌లో ఆదివారం భారీగా మంటలు చెలరేగగా, తమ దళాలు వాటిని సోమవారం నాటికి పూర్తిగా ఆర్పేశాయని అణుప్లాంట్ దగ్గర విధులు నిర్వహిస్తున్న రష్యా నియమిత గవర్నర్ యూవ్‌గెవ్‌నీ బాలిటెస్కీ పేర్కొన్నారు. 2022 లో రష్యా దళాలు ఈ అణు కేంద్రాన్ని తమ అధీనం లోకి తెచ్చుకున్నాయి. దీంతో రెండేళ్ల నుంచి ఇక్కడ అణు విద్యుత్ ఉత్పత్తి జరగలేదు. మొత్తం రియాక్టర్లను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కోల్డ్ షట్‌డౌన్‌లో ఉంచారు. అయితే తాజాగా ఈ ప్లాంట్ కూలింగ్ టవర్‌పై డ్రోన్ దాడిని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిపుణులు ఎక్స్‌లో వెల్లడించారు.

# న్యూఢిల్లీలో ఇండియా ర్యాంకింగ్స్-2024ను విడుదల చేసిన కేంద్రమంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 13: కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఇవాళ ఢిల్లీలో 'ఇండియా ర్యాంకింగ్స్-2024'ను ఆవిష్కరించారు. విద్యా మంత్రిత్వశాఖ 2015లో ఏర్పాటు చేసిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్' (ఎన్ఐఆర్ఎఫ్) ఆధారంగా ఈ ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్ మూర్తి; యూజీసీ ప్రొఫెసర్ ఎం.జగదీష్ కుమార్; 'ఏఐసిటిఇ' చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం; 'ఎన్ఇటిఎఫ్' చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధే; 'ఎన్‌బిఏ' సభ్య కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ నస్సా; ఉన్నత విద్యాశాఖ అదనపు కార్యదర్శి సునీల్ కుమార్ బర్నవాల్; సంయుక్త కార్యదర్శి గోవింద్ జైస్వాల్ సహా పలువురు విద్యావేత్తలు, విద్యా సంస్థల అధిపతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ- విద్యాసంస్థలకు ర్యాంకింగ్, రేటింగ్, అక్రిడిటేషన్ అనేవి కొత్త విద్యా విధానం-2020 (ఎన్ఇపి) ప్రధాన సిఫారసులలో ఒక ప్రక్రియ అని గుర్తుచేశారు. ఈ మేరకు 'ఎన్ఐఆర్ఎఫ్' ప్రకటించే ఈ ర్యాంకులు 'ఎన్ఇపి' స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. బోధన, ఆవిష్కరణ, పరిశోధన, గ్రాడ్యుయేషన్ ఫలితాలు, ఇతరత్రా అంశాల్లో అత్యుత్తమ పనితీరుతో 'ఇండియా ర్యాంకింగ్స్-2024'లో అగ్రస్థానం పొందిన ఉన్నత విద్యాసంస్థలన్నింటినీ కేంద్ర మంత్రి అభినందించారు.

విద్యాసంస్థల నాణ్యత పనితీరు, సామర్థ్యం తదితరాలను తెలుసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కు అని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి, దేశంలోని మొత్తం 58వేల ఉన్నత విద్యాసంస్థలూ ఈ చట్రం పరిధిలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. ఉపాధి సాధన సామర్థ్యం, నైపుణ్య కల్పన ప్రాతిపదికగానే ర్యాంకులలో ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. మన ర్యాంకింగ్ యంత్రాంగంలో నైపుణ్యాన్ని కూడా ఒక వరామితిగా చేర్చాలన్నారు. విద్య సంబంధిత అతి సునితాంశాలే అభ్యాస-వికాసాలకు ఉత్తేజమిస్తాయని మంత్రి చెప్పారు. కాబట్టి, అటువంటి అంశాలను ర్యాంకింగ్ చట్రం పరిధిలోకి తెచ్చే ప్రక్రియలను రూపొందించాలని సూచించారు.

భారత విద్యారంగంలోని ప్రధాన సంస్థలన్నీ ర్యాంకింగ్ చట్రం కిందకు రావాలని, ప్రతిష్ఠాత్మక లక్ష్య నిర్దేశంతో భవిష్యత్ ర్యాంకింగులలో అగ్రస్థానం కోసం కృషి చేయాలని మంత్రి కోరారు. వికసిత భారత్ సంకల్ప సాధనలో విశిష్ట విద్యా పర్యావరణ సృష్టిని సమష్టిగా ప్రోత్సహిద్దామని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

దేశంలోని విద్యా సంస్థల సార్వజనీనత, ఆవిష్కరణాత్మకత లక్ష్యంగా జాతీయ విద్యా విధానం-2020కి రూపకల్పన చేశారంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ తన ప్రసంగంలో కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్యా సంస్థల మధ్య ఆరోగ్యకర పోటీవల్ల భవిష్యత్ ప్రమాణాల్లో సమగ్రత మెరుగవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఎన్ఐఆర్ఎఫ్' ప్రారంభం తర్వాత పరిశోధనలతోపాటు విద్యార్థుల సంక్షేమం, ప్రచురణలు వగైరాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డాక్టర్ మజుందార్ తెలిపారు.

విద్యా సంస్థలు మెరుగైన ర్యాంకు సాధించేలా జాతీయ, ప్రాంతీయ స్థాయులలో విద్యా మంత్రిత్వ శాఖ అనేక కార్యశాలలు నిర్వహించిందని కార్యదర్శి శ్రీ కె.సంజయ్ మూర్తి తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందులో అఖిల భారతీయ శిక్షా సమాగమం పేరిట 2024 జూలై 29న నిర్వహించిన ప్రధానమైన కార్యశాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థల మధ్య సహకారం ప్రాముఖ్యాన్ని కూడా ఆయన నొక్కిచెప్పారు.

దేశంలోని ఉన్నత విద్యాసంస్థలకు ఇది వరుసగా 9వ దఫా ర్యాంకుల ప్రకటన కాగా, ప్రస్తుత (2024) ప్రక్రియలో జోడించిన నాలుగు ప్రత్యేకాంశాలిలా ఉన్నాయి:

తొలి ఇండియా ర్యాంకింగ్స్-2016లో విశ్వవిద్యాలయాలతో పాటు ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ రంగాలకు ర్యాంకులను ప్రకటించారు. అటుపైన తొమ్మిదేళ్లలో 7 కొత్త కేటగిరీలు, ఐదు కొత్త పాఠ్యాంశాలను జోడించి 8 కేటగిరీలు చేశారు. ఈ జాబితాలో- సమగ్ర (ఓవరాల్) ర్యాంకింగ్, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధన సంస్థలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, ఆవిష్కరణ సంస్థలు ఉన్నాయి. ఇక పాఠ్యాంశాల పరంగా విద్యారంగంలో- ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, వైద్యం, న్యాయ విద్య, డెంటల్, వ్యవసాయం-అనుబంధ రంగాలున్నాయి.

విద్యా మంత్రిత్వ శాఖ 2015 నవంబరులో ప్రారంభించిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్' (ఎన్ఐఆర్ఎఫ్)ను ఈ ఏడాది సహా 2016 నుంచి 2023 వరకు ఇండియా ర్యాంకింగ్స్ ప్రక్రియలో ఉపయోగించారు. 'ఎన్ఐఆర్ఎఫ్'లో ఐదు విస్తృత కేటగిరీల పారామితులు, వాటి ప్రాముఖ్యం ఇలా ఉన్నాయి:

ఈ ఐదు ప్రమాణాల్లో ప్రతి ఒక్కోదానికి 2 నుంచి 5 ఉప ప్రమాణాలున్నాయి. వివిధ కేటగిరీలు, సబ్జెక్ట్ డొమైన్లలో ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్ కోసం 18 ప్రమాణాలను ఉపయోగిస్తారు. ఈ ఐదు విస్తృత ప్రమాణాల్లో ప్రతిదానికీ కేటాయించిన మొత్తం మార్కుల ఆధారంగా సంస్థలకు ర్యాంకులు ఇస్తారు.

వివిధ ప్రమాణాల మూల్యాంకనంలో దరఖాస్తు చేసున్న సంస్థల నుంచి అందిన సమాచారంతో పాటు థర్డ్ పార్టీ సంస్థల వనరులను కూడా సాధ్యమైనంత మేర ఉపయోగించారు. ప్రచురణలు-పత్రాల సమాచారం డేటా కోసం స్కోపస్ (ఎల్సెవియర్ సైన్స్), వెబ్ ఆఫ్ సైన్స్ (క్లారివేట్ అనలిటిక్స్) ఉపయోగించారు. పేటెంట్లపై గణాంకాల సేకరణకు డెర్వెంట్ ఇన్నోవేషన్ ఉపయోగించగా, ఈ వనరుల నుంచి సమీకరించిన గణాంకాలను పారదర్శకత లక్ష్యంగా ఆయా సంస్థలతో పంచుకున్నారు.

2016 నుంచి 2024 వరకూ ర్యాంకింగ్ దరఖాస్తుల పెరుగుదల:

ఇండియా ర్యాంకింగ్స్ 2024 కోసం మొత్తం 6,517 విద్యా సంస్థలు "ఓవరాల్" కేటగిరీలో, నిర్దిష్ట రంగం లేదా డొమైన్-ప్రత్యేక ర్యాంకింగ్స్ కోసం దరఖాస్తు చేయగా, ఇవన్నీ ప్రత్యేక సంస్థలు. వివిధ కేటగిరీలు/డొమైన్ల కింద మొత్తం 10,845 దరఖాస్తులు రాగా- ఓవరాల్ కేటగిరీలో 2,781, ఇంజనీరింగ్ విభాగంలో 1,463, జనరల్ డిగ్రీ కాలేజీల్లో 3,371 ఉన్నాయి. దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు సంబంధించి ఇది సముచిత, పారదర్శక ర్యాంకింగ్ ప్రక్రియగా గుర్తింపు పొందిందనడానికి ఈ ఏడాది దరఖాస్తుల గణనీయంగా పెరడటమే నిదర్శనం. ఆ మేరకు ప్రత్యేక దరఖాస్తుదారుల సంఖ్య 2016లో 2,426 కాగా 2024 నాటికి 6,517కు చేరింది. అలాగే వివిధ కేటగిరీలలో ర్యాంకింగ్ కోసం మొత్తం దరఖాస్తుల సంఖ్య 2016లో 3,565 కాగా 2024 లో 10,845కు చేరింది. మొత్తం మీద 4091 (168.63 శాతం) నుంచి 7,280 (204.21 శాతం) మేర పెరిగాయి.

2016 నుంచి 2024 వరకు ర్యాంకులు.. సాధించిన సంస్థల సంఖ్యలో పెరుగుదల:

ఈ ర్యాంకింగ్స్ ప్రారంభం నుంచి చారిత్రకంగా 'ఓవరాల్' కేటగిరీ కింద విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాల విభాగాల్లో 100 సంస్థలకు ర్యాంకులు ఇచ్చారు. బడ్డాయి. వీటితోపాటు 100 సంస్థలకు ఓవరాల్ కేటగిరీ, విశ్వవిద్యాలయ కేటగిరీల్లో 50 చొప్పున రెండేసి ర్యాంకులు ఇచ్చారు. ఇంజనీరింగ్, కళాశాలల్లో 100-150, 151-200 చొప్పున రెండు ర్యాంక్ బ్యాండ్లు, 201-300 చొప్పున 100 మంది చొప్పున ఒక ర్యాంక్ బ్యాండ్ వంతున మూడు ర్యాంకు బ్యాండ్లలో 200 అదనపు సంస్థలకు ర్యాంకులిచ్చారు. మేనేజ్‌మెంట్, ఫార్మసీలో 2022 నుంచి ర్యాంకుల సంఖ్యను 75 నుంచి 100కు పెంచడంతో పాటు ఈ రెండు విభాగాల్లో (మేనేజ్‌మెంట్, ఫార్మసీ) 25 చొప్పున ర్యాంకులు సాధించారు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, లా, మెడికల్, డెంటల్, పరిశోధనా సంస్థలు, వ్యవసాయం అనుబంధ రంగాలు వంటి అంశాలకు 40 నుంచి 50 వరకు ర్యాంకులు వచ్చాయి.

కొత్తగా కేటగిరీల విషయానికొస్తే ఈ ఏడాది 50 రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు 51-100 ర్యాంకు బ్యాండులో అదనంగా 50 ర్యాంకులు లభించాయి. అయితే సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, నైపుణ్య విశ్వవిద్యాలయాల కేటగిరీల్లో కేవలం మూడు సంస్థలకు మాత్రమే ర్యాంకులు దక్కాయి. ఆవిష్కరణ సంస్థల విషయంలో 10 సంస్థలకు ర్యాంకులు ఇవ్వగా, అదనంగా మరో 40 సంస్థలకు 11-50 ర్యాంకులు ఇచ్చారు.

ఇండియా ర్యాంకింగ్-2024లో ప్రధానాంశాలు

ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - మద్రాస్ ఓవరాల్ కేటగిరీలో వరుసగా ఆరో ఏడాది (2019 నుంచి 2024 వరకు), ఇంజినీరింగ్ విభాగంలో వరుసగా తొమ్మిదో ఏడాది (2016 నుంచి 2024 వరకు) అగ్ర స్థానం నిలబెట్టుకుంది.

ఓవరాల్ కేటగిరీలో ఉత్తమ 100 ర్యాంకుల్లో 23 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, 22 ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలు, 16 ఐఐటీలు, 9 ఎన్ఐటీలు, 7 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు 7 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 4 ఒక్కో ఎయిమ్స్, ఐఐఎస్ఈఆర్, ప్రభుత్వ డీమ్డ్ యూనివర్సిటీలు, 3 ఇతర సీఎఫ్టీఐలు, ఒక కళాశాల ఉన్నాయి.

విశ్వవిద్యాలయాల కేటగిరీలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ 2016 నుంచి 2024 వరకు వరుసగా తొమ్మిదో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. పరిశోధన సంస్థల రంగంలో వరుసగా నాలుగో ఏడాది (2021 నుంచి 2024 వరకు) అగ్ర స్థానంలో నిలిచింది.

మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో ఐఐఎం-అహ్మదాబాద్ 2020 నుంచి 2024 వరకు వరుసగా ఐదో ఏడాది మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇది 2016 నుండి 2019 వరకు ఇండియా ర్యాంకింగ్స్ లో మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచింది.

ఢిల్లీలోని ఎయిమ్స్ 2018 నుంచి 2024 వరకు వరుసగా ఏడో ఏడాది వైద్యరంగంలో అగ్రస్థానంలో నిలిచింది. ఓవరాల్ కేటగిరీలో ఎయిమ్స్ 7వ స్థానంలో ఉంది. 2023లో ఓవరాల్ కేటగిరీలో 6వ స్థానంలో నిలిచింది.

ఢిల్లీలోని జామియా హమ్దర్ద్ ఈ ఏడాది ఫార్మసీలో అగ్రస్థానంలో నిలిచింది. జామియా హమ్దర్ద్ వరుసగా నాలుగేళ్లు (2019 నుంచి 2022 వరకు) మొదటి స్థానంలో నిలిచింది. 2018, 2023 సంవత్సరాల్లో ఫార్మసీలో 2వ స్థానంలో నిలిచింది.

కళాశాల రంగంలో 2017 నుంచి 2023 వరకు వరుసగా ఏడేళ్లు మొదటి స్థానాన్ని నిలబెట్టుకున్న మిరాండా హౌస్ స్థానాన్ని హిందూ కళాశాల తొలిసారిగా దక్కించుకుంది. హిందూ కళాశాల 2019, 2022, 2023 సంవత్సరాల్లో 2వ స్థానం లోనూ 2020, 2018లో వరుసగా 3, 4 స్థానాల్లో నిలిచింది.

ఐఐటీ రూర్కీ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో వరుసగా నాలుగో ఏడాది (2021 నుంచి 2024 వరకు) మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది. ఐఐటీ రూర్కీ 2018 నుంచి 2020 వరకు రెండో స్థానంలో నిలిచింది.

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ వరుసగా ఏడో సంవత్సరం (2018 నుంచి 2024 వరకు) న్యాయశాస్త్రంలో మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది.

మొదటి 10 కళాశాలల్లో ఢిల్లీ నుంచే ఆరు కాలేజీలు ఉండగా, వాటి ర్యాంకింగ్ లో ఢిల్లీలోని కాలేజీలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించాయి.

డెంటల్ సబ్జెక్టుల్లో చెన్నైలోని సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ వరుసగా మూడో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది.

ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వరుసగా రెండో ఏడాది వ్యవసాయం-అనుబంధ రంగాల్లో అగ్రస్థానంలో నిలిచింది.

2024లో తొలిసారి ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల కేటగిరీలో చెన్నైలోని అన్నా యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలిచింది.

ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) 2024లో తొలిసారి ప్రవేశపెట్టిన ఓపెన్ యూనివర్సిటీల కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది.

ఆవిష్కరణల విభాగంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాన్పూర్ అగ్రస్థానంలో నిలిచింది.

పుణెలోని సింబయాసిస్ స్కిల్ అండ్ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎస్ఎస్పీయూ) ఈ ఏడాది తొలిసారిగా నైపుణ్య విశ్వవిద్యాలయాల కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది.

# వాతావరణంలో మార్పుల కారణంగా విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్

## - జర్వం, జలుబు, గొంతునొప్పి, దగ్గు, వాంతులు, విరేచనాలు
## - సుపత్రులకు క్యూ కడుతున్న జనం



హైదరాబాద్ ఆగష్టు 13(ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ వాతావరణంలో మార్పుల కారణంగా రోగాలు ప్రబలుతున్నాయి. జర్వం, జలుబు, గొంతునొప్పి, దగ్గు, వాంతులు, విరేచనాలతో జనం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఏ హాస్పిటల్ చూసినా వైరల్ ఫీవర్ బాధితులతో కిక్కిరిసిపోతోంది. ప్రతి ఇంటి నుంచి ఒక్కరైనా వైరల్ ఫీవర్ బాధితులుంటున్నారు. వర్షాకాలం.. కొన్ని రోజులుగా వాతావరణం ముసురుగా ఉండటంతో విషజ్వరాల సంఖ్య భారీగా పెరిగిపోయింది. పది రోజులుగా పలు రకాల జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఒక్క ఫీవర్ హాస్పిటల్‌లోనే రోజుకు 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటోంది. సాధారణ రోజుల్లో ఇక్కడ 300 నుంచి 400 మంది మాత్రమే వస్తుంటారు. సీజన్‌మార్పుల కారణంగా ఈ సంఖ్య సుమారు ఐదు రెట్లు పెరిగింది. ఇక ఇన్ పేషెంట్‌గా చేరుతున్న వారి సంఖ్య రోజుకు 30 నుంచి 40 వరకు ఉంటోంది. వీరిలో ఎక్కువగా హెపటైటిస్, చికెన్ గున్యా, డెంగ్యూ, విషజర్వాల బాధితులు ఉంటున్నారు. ఒక్క ఫీవర్ హాస్పిటల్‌లో మాత్రమే కాదు ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ హాస్పిటల్స్‌లో కూడా వైరల్ ఫీవర్స్ బాధితుల సంఖ్య పెరిగింది. ప్రతి హాస్పిటల్ రోజు ఉండే సాధారణ ఓపీ కన్నా 500 వందల మంది వరకు ఎక్కువ ఒపి ఉంటోంది. పెరిగిన ఓపీ మొత్తం కూడా వైరల్ ఫీవర్స్ బాధితులేనని వైద్యులు చెబుతున్నారు. దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉంటే ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

# కదిరిలో వర్షం భీభత్సం.. 20గొర్రెలు మృతి..

## - వరి పంట నష్టం.. పలు గ్రామాల్లో ఇళ్లలోకి వర్షం నీరు



అమరావతి, ఆగష్టు 13: శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కదిరి రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో భీభత్సం సృష్టించింది. గొర్రెలు పదుల సంఖ్యలో మృతిచెందగా వరి పంటకు భారీ నష్టం జరిగింది. మల్లయ్య గారి పల్లి తండా, కౌలేపల్లి, బేరిపల్లి తదితర గ్రామాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ముఖ్యంగా మల్లయ్య గారి పల్లి తండాలో వర్షం కారణంగా 20 గొర్రెలు మృతి చెందాయి. పలు కుటుంబాల వారు కట్టుబట్టలతో బయటికి వచ్చారు. వృద్దులు వర్షం నీటిలోనే మంచాలపై కూర్చుండిపోయారు. ఇటీవల తండా సమీపంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారని, కేవలం ఒక పైపు మాత్రమే అమర్చి కల్వర్టు వేయడంతో వర్షం నీరు అధికమై కల్వర్టుపైన నీరు వచ్చి ఇళ్లలోకి చేరిందని స్థానికులు తెలిపారు.

ప్రాణ నష్టం జరగలేదని, కానీ పశు సంపద, నిత్యవసర సరుకులు, వస్త్రాలు వంటివి పూర్తిగా కోల్పోవడం జరిగిందని బాధితులు తెలిపారు. ఇదే సందర్భంలో ఎర్రదొడ్డి సమీపంలో వరినాట్లు వేసిన రైతులు వర్షం దెబ్బతో మొత్తం పంట నష్టపోయామని చెబుతున్నారు. ఇంకా చేతికి వచ్చిన మొక్కజొన్న, సజ్జ వంటి పంటలు కూడా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. కాగా నష్టం అంచనాలకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసేందుకు ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. వర్షం బీభత్సం కారణంగా నష్టపోయిన కుటుంబాలకు రైతులకు తగిన పరిహారం చెల్లించే విధంగా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా మల్లయ్య గారి పల్లికి చెందిన గ్రామస్తులు కోరారు.

ఇదిలా ఉండగా మంగళవారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 200.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తనకల్లు మండలంలో 94.5 మిల్లీమీటర్లు, అమడగూరులో 88.4 మిల్లీమీటర్లు, కదిరిలో 24.2 మిల్లీ మీటర్లు, హిందూపురంలో 74.6 మిల్లీ మీటర్లు, ధర్మవరంలో 62.4 పెనుకొండలో, 57.0, కొత్త చెరువులో 56.4, ఓబుల దేవర చెరువులో 55.4, సోమందేపల్లిలో 50.4, బుక్కపట్నంలో 49.6, రామగిరి లో 46.4, పరిధిలో 45.2, గోరంట్లలో 45.2, చెన్నే కొత్తపల్లిలో 42.2, పుట్టపర్తి లో 39.8, లేపాక్షిలో 37.2, నల్లమడలో 35.4 చిలమత్తూరులో 32.6, రొద్దంలో 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం జరిగింది. ఈ వర్షం గత రెండు వారాల క్రితం కురిసి ఉంటే వేరుశనగ పంట సాగుకు అనుకూలంగా ఉండేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈవర్షం వలన వెలసిన సాగు చేయడం వలన ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం ఉండదని తెలుస్తోంది. ఏదేమైనా సుమారు రెండు నెలలు అనంతరం జిల్లాలో ఓ మోస్తరుగా వర్షం కురవడం పట్ల రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది.

# బిరియాని అంటే ఆశ పడ్డారు.. ఇప్పుడు పస్తులుంటున్నారు..

- చంద్రబాబుపై జగన్ విమర్శలు
- మోసంతోనే కూటమి గెలిచింది
- ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదు
- ప్రస్తుతం ఎపిలో రెడ్ బుక్ పాలనే
- తాను అధికారంలో ఉంటే అన్ని పథకాలు అమలు



అమరావతి, ఆగష్టు 13: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఆశ చూపారని, కానీ చివరకు మోసం చేస్తున్నారని విమర్శించారు వైసిపి అధినేత , మాజీ ముఖ్యమంత్రి జగన్ . రాష్ట్రం ఎంతో ఆర్థిక సంక్షోభం ఉన్నా అప్పట్లో తన ప్రభుత్వం సాకులు చూపలేదని, మాట తప్పుకుండా మేనిఫెస్టోని అమలు చేశామని పేర్కొన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకి కట్టుబడి పనిచేశామన్నారు.

మాడుగుల నియోజకవర్గ ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో నేడు తాడేపల్లి తన నివాసంలో జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ , ఎన్నికలు వచ్చేసరికి ఈ మంచే శ్రీరామ రక్ష అని నమ్మామని అన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారితీస్తాయని వ్యాఖ్యానించారు. తాను పలావు ఇచ్చానని.. బాగానే చూసుకున్నాననని ప్రజలు అంటున్నారన్నారని పేర్కొన్నారు. బిర్యానీ పెడతానన్న చంద్రబాబు మాటలు నమ్మిన ప్రజలు ప్రజలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. తాను ఉండి ఉంటే.. రైతు భరోసా అందేదన్నారు. స్కూళ్లకు వెళ్తున్న ప్రతి పిల్లాడి తల్లులకు అమ్మ ఒడి అందేదన్నారు. సున్నా వడ్డీ కూడా వచ్చి ఉండేదన్నారు. విద్యాదీవెన కింద ఫీజురియింబర్స్‌మెంట్, వసతి దీవెన వచ్చేదన్నారు. మత్స్యకార భరోసా, వాహన మిత్ర కూడా వచ్చి ఉండేదన్నారు. ఇంటికే వచ్చి పథకాలు అందించే పరిస్థితి పోయిందన్నారు. జన్మభూమి కమిటీల చుట్టూ, తెలుగుదేశం నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు ఇప్పుడు మోసం చేస్తున్నారని.. ఈ ప్రభుత్వం ప్రతి అడుగులో కూడా మోసం కనిపిస్తోందన్నారు. ఆరోగ్య శ్రీ కింద ఒక్క పైసా ఇవ్వడం లేదని, ఇప్పటికే రూ.1600 కోట్ల బకాయిలు ఉన్నాయని జగన్ పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ కూడా పూర్తిగా దిగజారిపోయిందన్నారు. ప్రస్తుతం రెడ్ బుక్ పాలన నడుస్తోం దన్నారు. కక్షలు తీర్చుకునేవారిని పోత్సహించేలా చంద్రబాబు తీరు ఉందన్నారు. ఈ మోసాలను చూస్తున్న ప్రజల్లో ఆగ్రహం మొదలవుతోందన్నారు.

# విజయవంతంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్..

## - ఫుల్ డ్రెస్ సన్నద్ధతను పరిశీలించిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు

అమరావతి, ఆగష్టు 13: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ విజయవంతమయ్యాయి.

రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్.. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, ఏపీఎస్‌పీ డీఐజీ బి.రాజకుమారి, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి రిహార్సల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. త్రివర్ణ శోభిత వేడుకలకు సంబంధించి అడిషనల్ డీజీపీ (ఎఫ్ఏసీ), ఏపీఎస్‌పీ బెటాలియన్స్, ఐజీపీ (శాంతిభద్రతలు) సీహెచ్ శ్రీకాంత్ నోడల్ అధికారిగా, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు పోలీస్ సమన్వయ అధికారిగా, ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం రాష్ట్ర సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఏఎస్ఆర్ జిల్లా అడిషనల్ ఎస్‌పీ కె.ధీరజ్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్‌పీ 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండ్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్‌పీ 3వ బెటాలియన్ ఆర్ఐ టి.ప్రభాకర్‌రావు వ్యవహరించనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కవాతులో తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ (కర్నూలు), ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ (కాకినాడ), ఏపీఎస్‌పీ 11వ బెటాలియన్ (కడప), ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం), ఎన్‌సీసీ బాలురు, ఎన్‌సీసీ బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనికల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి.

బ్రాస్‌బ్యాండ్స్ విభాగంలో కర్నూలు, కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, కడప, అనంతపురం, విశాఖపట్నం ఏపీఎస్‌పీ బెటాలియన్లతో పాటు మంగళగిరి ఏపీఎస్‌పీ బెటాలియన్స్ పైప్‌బ్యాండ్, ఎస్ఏఆర్ సీపీఎల్ హైదరాబాద్ యూనిట్ బ్రాస్, పైప్ బ్యాండ్స్ బృందాలు పాల్గొననున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, తదితరులు హాజరుకానున్నారు.





# బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగష్టు 13: బాన్సువాడ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు.

బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడారు.

పోచారం శ్రీనివాస్ రెడ్డిని అన్ని రకాలుగా గౌరవించినప్పటికీ పార్టీని వీడటం ఆయనకే నష్టమని కేటీఆర్ చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందన్నారు. అయితే కష్ట కాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు.

రేవంత్ రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందని మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

బాన్సువాడ ఉప ఎన్నికల్లో కచ్చితంగా పోచారం ను ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదని? బీఆర్ఎస్‌కు కార్యకర్తలే కొండంత అండ అని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు.

ఉప ఎన్నికల్లో కచ్చితంగా పార్టీ మారిన వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెబుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గులాబీ జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా? గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు తెలిపారు.

# ట్యాంక్ బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళ

హైదరాబాద్, ఆగష్టు 13: ఓ మహిళ ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ట్యాంక్ బండ్ శివ కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే ట్యాంక్ బండ్ శివ హుస్సేన్ సాగర్‌లోకి దూకి మహిళను బయటకు తీసుకొచ్చారు.

ఆమె ప్రాణాలతో ఉండడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

# ఆపదమొక్కుల వాడికి విరాళాల వెల్లువ ..

## -హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రూ. 51 లక్షల విరాళం అందజేత



తిరుపతి, ఆగష్టు 13: : కలియుగ ప్రత్యక్షదైవం, ఆపద మొక్కుల వాడు తిరుమల వేంకటేశ్వర స్వామికి దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. నిన్న పంజాబ్ పారిశ్రామికవేత్త రాజిందర్ గుప్తా రూ. 21 కోట్లను అందజేయగా హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బొమ్ము వెంకటేశ్వర రెడ్డి రూ. 51,09,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఎస్వి అన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళాన్ని అందజేస్తూ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి చెక్కును అందించారు.

అదేవిధంగా టీటీడీ ఉద్యానవన విభాగానికి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారు రూ. 4.10 లక్షల విలువైన ఎరువులను అందించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఆర్ఎం రమణారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మురళి ఈ మేరకు ఎరువులను తిరుమలలోని కల్యాణవేదిక వద్ద గల ఉద్యానవన విభాగం కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు.

తిరుమల, తిరుపతిలోని ఉద్యానవనాల్లో మొక్కల పెంపకానికి ఈ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మధు, అనిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రామానంద స్కూల్ అభివృద్ధికి సహకరిస్తాం: ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, ఆగష్టు 13: రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం బేగంపేటలోని రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును ఆయన ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో కలిసి ప్రారంభించారు. ముందుగా స్కూల్ ఆవరణలో దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఎంతో మందికి శ్రీరామానంద తీర్థ మెమోరియల్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ మెమోరియల్‌ను నిర్వహిస్తూ అభివృద్ధిలోకి తీసుకువచ్చిన మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎమ్మెల్సీ సురభి వాణిదేవిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మెమోరియల్ సభ్యులు చంద్రశేఖర్, శేఖర్ మారం రాజు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీని రాజకీయంగా దెబ్బతీసేందుకే జోగి రమేష్ కుమారుడి అరెస్ట్ : మాజీ మంత్రి పేర్నినాని

అమరావతి, ఆగష్టు 13: వైసీపీని రాజకీయంగా దెబ్బతీసేందుకు నాయకులు, కార్యకర్తలపై అధికార కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తుందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. సుదీర్ఘకాలంలో పార్టీకి నష్టం చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్‌ని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ఏం తప్పు జరిగిందని ప్రశ్నించారు. చట్టానికి లోబడి జోగి రమేష్ రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి తిరిగి రైతులకు విక్రయించారని, ఎక్కడా కూడా జోగి రమేష్ గాని, అతడు కుమారుడు గాని తప్పు చేయలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. అగ్రిగోల్డ్ భూములతో ఎలాంటి సంబంధం లేదని ఆరోపించారు.

ముందస్తు విచారణ లేకుండా జోగిరమేష్ కొడుకును అరెస్టు చేశారని తెలిపారు. అక్రమ కేసులు పెట్టి మానసిక వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. ఎంతమందిని అరెస్టు చేసినా వైసీపీ పోరాటాలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. టీడీపీ చేస్తున్న తప్పులను అడుగడుగునా నిలదీస్తాం. న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

# గురుకుల స్కూళ్ల సమస్యలపై స్పందించడం అభినందనీయం : కేటీఆర్

హైదరాబాద్, ఆగష్టు 13: రాష్ట్రంలో గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటనతో ప్రభుత్వంలో చలనం వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ హాస్టళ్ల బాటపట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల హాస్టల్‌కు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. గురుకుల స్కూళ్ల సమస్యలపై మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. 8నెలల్లో కలుషిత ఆహారంతో 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. నిన్న బీబీపేట పాఠశాలలో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన భోజన వసతి కల్పించాలి. పాఠశాలల్లో వసతులు, సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ కోరారు. కేసీ ఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 0కు పైగా గురుకులాల్లో ప్రాణనష్టం జరగకుండా.. ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు డిప్యూటీ సీఎం, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటు ందని ఆశిస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు

# ప్రజాల్లో ఉండండి.. సమస్యల పరిష్కారానికి పని చేయండి: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగష్టు 13: ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మణికొండ మున్సిపాలటీ భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌రావును నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని క్రిన్స్ టెర్మినస్ విల్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే కాలంలో ప్రజల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, ఇప్పటి వరకు కార్యకర్తలకు సరైన గుర్తింపు లేకుండా పోయిన విషయాన్ని తెలుసుకోవడం జరిగిందన్నారు.

మణికొండ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, మణికొండ కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, విజయలక్ష్మి, రేఖ, సీనియర్ నాయకులు ముతంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జై, బుద్దోల్ బాబు, దిలీప్, భాను, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, యాలాల కిరణ్, ఎర్రోళ్ల రమేశ్, వివాజీ, ఆరీఫ్, సయ్యద్ రఫీక్, ఎల్లస్వామి, సబిన్, అలి, అశోక్, కృపాకర్, మోనేశ్ పాల్గొన్నారు.

# డబుల్ లబ్ధిదారుల ధర్నా.. లబ్ధిదారులను సముదాయించిన మేయర్, కమిషనర్

## -ప్రజావాణిలో పరిష్కరించాలని బైఠాయింపు

## -రెండు నెలల్లోగా మౌలిక వసతులు కల్పిస్తామని హామీ



హైదరాబాద్, ఆగష్టు 13: డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే అందజేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వందలాది మంది లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వచ్చిన వీరంతా తొలుత ప్రజావాణి కార్యక్రమంలోకి వెళ్లారు. చాలా మంది బయట గార్డెన్‌లో బైఠాయించి డబుల్‌బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాలనే నినాదాలతో హోరెత్తించారు.

కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 66వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. లిఫ్టులు పనిచేయడం లేదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చివరకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి లబ్ధిదారులతో మాట్లాడారు. జలమండలికి ఇప్పటికే రూ. 200కోట్ల మేర నిధులు ఇవ్వాల్సి ఉన్నదని, రాబోయే రెండు నెలల్లోగా డబుల్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

### రూ. 100కోట్ల నిధులు ఏమయ్యాయి..

కేసీఆర్ ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల పథకంలో 66 లొకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేసింది. ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు హెచ్ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్ఎంసీకి బదలాయించింది. కానీ నేటికీ ఆ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. పైగా డ్రైనేజీ, నల్లా కనెక్షన్ వేసిన జలమండలికి నిధులు మంజూరు చేయలేదు. డబుల్ బెడ్రూం ఇండ్లకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. అయితే రూ. 200కోట్ల నిధులను ఎలా సమకూర్చుకుని మౌలిక వసతులు ఎలా కల్పిస్తారన్నది స్పష్టత లేదు.

పార్కును కాపాడండి

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని తిరిగి కాలనీ వాసులకు ఇప్పించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ ముదిరాజ్, యాదవరెడ్డి తదితరులు ప్రజావాణిలో అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్‌ను కలిసి విన్నవించారు.

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి 239 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా 156 దరఖాస్తులు గృహ నిర్మాణ శాఖకు సంబంధించినవి కాగా, పింఛన్లు 18, భూ సమస్యలు 14 దరఖాస్తులు వచ్చాయి.

### ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ఆమ్రపాలితో కలిసి ఆమె ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. బల్దియాలో జరిగిన ప్రజావాణిలో 57 దరఖాస్తులు రాగా, ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, జీహెచ్ఎంసీ శానిటేషన్, ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం బల్దియాలో జరిగిన ప్రజావాణిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి విన్నవించారు.

# టెలిగ్రాఫ్ దినపత్రిక ఎడిటర్‌గా బ్రిటన్ మాజీ ప్రధాని !

న్యూఢిల్లీ, ఆగష్టు 13: బ్రిటన్‌కు చెందిన టెలిగ్రాఫ్ దినపత్రికకు.. ఎడిటర్‌గా ఆ దేశ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ దేశానికి చెందిన మీడియా సంస్థలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం టెలిగ్రాఫ్ దినపత్రిక గడ్డురోజులను గడుపుతున్నది. అయితే ఆ పత్రికను నధీమ్ జాహవి కొనుగోలు చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్.. నధీమ్ జాహవితో ఎడిటర్ పోస్టు గురించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. టెలిగ్రాఫ్ న్యూస్‌పేపర్‌లో ఓ సీనియర్ పాత్రను పోషించేందుకు బోరిస్ ఆసక్తిగా ఉన్నట్లు స్కై న్యూస్ ఓ కథనాన్ని రాసింది. అయితే దీనిపై ఇంకా అగ్రిమెంట్ జరగలేదు.

జాహవితో జాన్సన్ సంప్రదింపులు జరిపినట్లు టెలిగ్రాఫ్ సంస్థ తెలిపింది. సుమారు 20 ఏళ్ల పాటు బార్క్‌లే ఫ్యామిలీ టెలిగ్రాఫ్ పత్రిను నడిపింది. అయితే ప్రస్తుతం ఆ సంస్థ బాకీలు చెల్లించలేకపోతున్నది. దీంతో ఆ మీడియా ఔట్‌లెట్‌ను వేలానికి పెట్టారు. చాలా మంది కోటీశ్వరులు ఆ పత్రికను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఎడిటర్ పోస్టు విషయంలో మాత్రం జాన్సన్ ప్రతినిధి ఎటువంటి వివరణ ఇవ్వలేదు.

# నూతన ప్రిన్సిపాల్‌ను సన్మానించిన తిరుమలాయపాలెం గురుకుల పేరెంట్స్ కమిటీ



ఖమ్మం, ఆగష్టు 13: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని బొమ్మ కళాశాల ప్రైవేట్ బిల్డింగ్ నందు నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం గురుకుల పాఠశాల/కళాశాలలో నూతన ప్రిన్సిపల్ పి.సత్య ప్రసాద్ రాజు నూతన అధ్యాపక బృందాన్ని, ఉద్యోగులు అందరినీ గౌరవప్రదంగా పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పప్పుల వేణుగోపాల్, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సురేష్, రవి, అలాగే పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బోస్, కళాశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, మురళి, విద్యార్థులు పాల్గొనడం జరిగింది. 78వ స్వాతంత్ర దినోత్సవం సంవత్సరాన్ని పురస్కరించుకొని పిడి, పిఈటి నిర్వహించే ఆటల పోటీలను, గురుకుల పాఠశాలలో, కళాశాలలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారిని ఉత్సాహపరిచి, మంచి ఉత్సాహంతో దృఢ సంకల్పంతో విజయాలను అందుకునేందుకు వారికి ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని తెలియజేయడం జరిగింది. విద్యార్థులు చాలా ఉత్సాహంతో తమ యొక్క ఆటపాటలను అదేవిధంగా చదువు శ్రద్ధలను దీర్ఘ దృష్టితో నేర్చుకుంటామని వారు కమిటీ సభ్యులకి తెలియజేశారు, అంతేకాకుండా ఈ ఆగస్టు 15వ తారీకు ఎక్కువ బహుమతులు పొందేందుకు కష్టపడతామని వారు తెలియజేశారు. అలాగే పాఠశాల సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు తుంబూరు దయాకర్ రెడ్డిని కలిసి వివరించడం జరిగింది. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ వివరణను కోరారు. త్వరలో వారికి గురుకుల సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మరొక రోజు వారికి పూర్తి వివరాలతో మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పుల వేణుగోపాల్ తెలియజేశారు.

# 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తేదీ ఖరారు

హైదరాబాద్, ఆగష్టు 13: వస్తు, సేవల పన్ను కు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 9వ తేదీన న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌అధ్యక్షతన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు.

ఈ విషయాన్ని జీఎస్టీ కౌన్సిల్ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా వెల్లడించింది. ఈ భేటీలో రేట్ల హేతుబద్ధీకరణపై చర్చించే అవకాశం ఉంది.

జూన్ 22న 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌లో రైల్వే ప్లాట్‌ఫాం టికెట్లు, విశ్రాంతి గదులు, నెలకు రూ. 20 వేల కంటే తక్కువ ఛార్జీలు వసూలు చేసే అన్ని ప్రైవేటు హాస్టళ్లకు జీఎస్టీ మినహాయింపు వర్తింపు, అన్ని పాల క్యాన్లపై జీఎస్టీని 12 శాతంగా, కార్టన్ బాక్సులపై 18 శాతం నుంచి 12 శాతానికి పన్ను తగ్గింపు, పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే విషయంలో రాష్ట్రాలదే కీలక పాత్ర, ఎరువులపై జీఎస్టీ మినహాయింపు వంటి వాటిపై నిర్ణయాలు తీసుకున్నారు.

# చంద్రబాబుతో సునీతా కృష్ణన్ భేటి..

అమరావతి, ఆగష్టు 13: ప్రముఖ సామాజిక కార్యకర్త, ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీతా కృష్ణన్ నేడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఇటీవలే ఆమె సోషల్ మీడియా ద్వారా చంద్రబాబు అపాయింట్ మెంట్ కోరగా, చంద్రబాబు సానుకూలంగా స్పందించి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అపాయింట్ మెంట్ ఖరారు చేశారు.

"చంద్రబాబు సర్ మిమ్మల్ని కలవడం ఎంతో సంతోషం కలిగించింది. నా జీవితగాథ పుస్తకం 'ఐ యామ్ వాట్ ఐ యామ్' ను మీకు అందించడం నాకు లభించిన గౌరవంగా భావిస్తాను. మీ విలువైన సమయాన్ని నాకోసం కేటాయించినందుకు ధన్యవాదాలు. సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణాపై పోరాటానికి సహకరించాలన్న మా ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవడానికి మీరు చూపిన సానుకూల స్పందన హర్షణీయం. అదే సమయంలో లైంగిక నేరగాళ్ల వివరాలు, లైంగిక నేరాల తగ్గింపునకు అనుసరించాల్సిన వ్యూహం గురించి మీకు వివరించగలిగే అవకాశం దక్కినందుకు సంతోషిస్తున్నాను. ఎప్పట్లాగే మీతో సమావేశం ఎంతో స్ఫూర్తిని కలిగించింది" అంటూ చంద్ర బాబును ఉద్దేశించి సునీతా కృష్ణన్ ట్వీట్ చేశారు. కాగా, సునీతా కృష్ణన్ ట్వీట్ పట్ల చంద్రబాబు కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "సునీతా కృష్ణన్ గారు మీ ఆలోచనలను పంచుకున్నందుకు కృతజ్ఞతలు. ఏ విధమైన సహాయసహకారాలతో ముందుకు పోవాలన్నదానిపై ఆలోచిస్తున్నాం" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

